మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?

M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com

సంప్రదించండి



మనం
జనం కోసం అక్షర యజ్ఞం...

ఉమ్మడి
ఉత్తరాంధ్ర జిల్లాలు

శనివారం | 17 | అక్టోబర్ | 2026 | పేజీలు : 09

## పరిషత్ ఎన్నికలకు ఈ నెల 21 నుండి నామినేషన్ల స్వీకరణ

### సన్నద్ధత పై సమీక్షించిన సంయుక్త కలెక్టర్ జి. విద్యాధరి

**విశాఖపట్నం , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** ఎం.పి.టి.సి, జెడ్. పి.టి.సి ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ఈ నెల 21వ తేదీ నుండి స్వీకరించడం జరుగుతుందని, ఎన్నికలు నవంబర్ 3న, ఓట్ల లెక్కింపు 5వ తేదీన జరుగుతాయని సంయుక్త కలెక్టర్ జి.విద్యాధరి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో ఏర్పాట్లు పై జేసీ సమీక్షించారు. సజావుగా ఎన్నికల నిర్వహిం చుటకు గానూ నోడల్ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. డివిజనల్ స్థాయి లో ఆర్.డి. ఓ లు ఇంచార్జ్ లుగా వుంటారని, అసిస్టెంట్ అథారిటీ గా ఎం.పి.డి. ఓ లు వ్యవహరిస్తారని తెలిపారు. 203 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు 2వ పేజీలో

# జీవీఎంసీ సాధారణ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు

- 120 వార్డులు, 1,990 పోలింగ్ కేంద్రాలు, 18.37 లక్షలకు పైగా ఓటర్లు
- ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సమగ్ర చర్యలు
- జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అథారిటీ కేతన్ గార్గ్



**విశాఖపట్నం , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ (జీవీఎంసీ) సాధారణ ఎన్నికలు--2026ను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు శుక్రవారం జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అథారిటీ కేతన్ గార్గ్ తెలిపారు. జీవీఎంసీ పరిధిలోని 120 వార్డులకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కమిషనర్ తెలిపారు. జీవీఎంసీ పరిధిలో మొత్తం 18,37,901 మంది ఓటర్లు ఉండగా, ఎన్నికల నిర్వహణ కోసం 1,990 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే అంశానికి సంబంధించి చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా సంబంధిత ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఇతర సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, సిబ్బంది విధుల కేటాయింపు, ఎన్నికల సామగ్రి నిర్వహణ వంటి అంశాలపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. శుక్రవారం నుండి నామినేషన్లు స్వీకరిస్తున్నామని , 18వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల స్వీకరణకు తుది గడువని తెలిపారు.

2వ పేజీలో

### ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన అనుచరుల దౌర్జన్యాలపై

# కఠిన చర్యలు తప్పవు

**టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలి : టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు**



2వ పేజీలో

**అమరావతి , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఆయన అనుచరుల దౌర్జన్యపూరిత వైఖరిని ఉపేక్షించే ప్రసక్తే లేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ ప్రజలను, అధికారులను భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు అడ్డుకట్ట వేయాలని, ఘటనల్లో బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని అరాచకాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. మిథున్‌రెడ్డి, ఆయన తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం గతంలోనూ దౌర్జన్యపూరితంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయని పల్లా పేర్కొన్నారు. పుంగనూరు ఘటనలో చోటుచేసుకున్న పరిణామాలపై సమగ్ర

## విశాఖ కూటమి

# మేయర్ అభ్యర్థిగా ముక్కా శ్రావణి

- ముక్కా శ్రావణి పేరుపై కాపుసేన హర్షం!
- మేయర్ పదవి కేటాయింపుపై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు
- విశాఖ మేయర్ గెలిపించి కూటమి నాయకులకు గిఫ్ట్ గా ఇస్తాం

**విశాఖపట్నం , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ):** జీవీఎంసీ మేయర్ పదవికి డాక్టర్ ముక్కా శ్రావణి పేరు తెరపైకి రావడంపై కాపుసేన రాష్ట్ర అధ్యక్షుడు బండారు నారాయణమూర్తి (బి.ఎన్. మూర్తి) హర్షం వ్యక్తం చేశారు. మేయర్ పదవిని కాపు సామాజిక వర్గానికి కేటాయించే అంశంపై సానుకూలంగా వ్యవహరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయ నేపథ్యంతో పాటు విద్యార్హతలు, గతంలో కార్పొరేటర్‌గా



2వ పేజీలో

# జీవీఎంసీ సాధారణ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు

ఒకటి తరువాయి

నామినేషన్ల ప్రక్రియలో ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అభ్యర్థులకు అవసరమైన సమాచారం అందించేందుకు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయడంతోపాటు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు. పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, సంబంధిత అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బంది తమ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల మార్గదర్శకాలను పాటిస్తూ రాజకీయ పార్టీలకతీతంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన సమాచారాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు అందించడంతోపాటు, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ప్రజలు, రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు సహకరించాలని, ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ కోరారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి వ్యతిరేకంగా ఏదైనా చర్య జరిగిన యెడల సమాచారం తెలుపుటకు జీవీఎంసీ కంట్రోల్ రూమ్ నంబర్ 1800 4250 0009 టోల్ ఫ్రీ నెంబర్ కు సంప్రదించవచ్చునని కమిషనర్ తెలిపారు.

**గమనిక :** ఎన్నికలకు సంబంధించిన జోన్లు ,వార్డులు, పోలింగ్ స్టేషన్ లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, ఓటింగ్ స్ట్రెంత్ తదితర వివరాలతో కూడిన కాపీని జత చేయడమైనదని తెలియపరచడమైనది.

# ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

## జీకేవీధి మండల రిటర్నింగ్ అధికారి బాబు



**గూడెంకొత్తవీధి , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని జీకే వీధి మండల రిటర్నింగ్ అధికారి బాబు కోరారు. శుక్రవారం మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ, ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రమణబాబు, తహసీల్దార్ అన్నాజీరావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు నో చెప్పండి




**పాయకరావుపేట , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** స్పేసెస్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న 18 వ ఆంధ్ర బెటాలియన్, ఎన్ సి సి, కాకినాడ ఆధ్వర్యంలో సంయుక్త వార్షిక శిక్షణా శిబిరంలో భాగంగా యువతలో మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించేందుకు "డ్రగ్స్ వద్దు" అనే నినాదంతో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను యువతకు వివరించి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సందేశాన్ని అందించారు. యువత దేశ భవిష్యత్తుకు వెన్నెముక అని, వారు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, యువతలో సామాజిక బాధ్యత మరియు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేజర్ మోహమ్మద్ ఆసిఫ్, మేజర్ శశి మెహతా, సిబ్బంది పాల్గొన్నారు.



# కఠిన చర్యలు తప్పవు

ఒకటి తరువాయి

విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని పల్లా సూచించారు. ఎవరెంతగా రెచ్చగొట్టినా చట్టాన్ని గౌరవించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా గొడ్డలిపార్టీ దౌర్జన్యాలకు పాల్పడి, ఏకగ్రీవాల పేరుతో ప్రత్యర్థులకు అవకాశం లేకుండా చేసిందని విమర్శించారు. ఈసారి అలాంటి అక్రమాలకు తావులేకుండా ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని కోరారు. నామినేషన్ల నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజల తీర్పే కీలకం కావాలి తప్ప, బెదిరింపులు, దౌర్జన్యాలు కాదు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# పరిషత్ ఎన్నికలకు ఈ నెల 21 నుండి నామినేషన్ల స్వీకరణ

ఒకటి తరువాయి

చేయడమైందని, ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద కనీస వసతులు ఉండేలా పంచాయతీ రాజ్ ఎస్.ఈ చూడాలనిసూచించారు. మోడల్ కోడ్ వెంటనే అమలులోకి వస్తుందని తెలిపారు. పార్టీల ప్రతినిధుల ఫోటోలు, ఫ్లెక్సీలు తొలగించాలని, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని తెలిపారు. ఎన్నికల సామాగ్రిని, పోలింగ్ అధికారులను సిబ్బందిని నియమించడం జరిగిందని, వారికి శిక్షణలు కూడా వెంటనే ఇవ్వాలని తెలిపారు. ఎన్నికల విధులలో స్వంత తెలివితేటలను వాడకూడదని, పనులన్నీ ఇచ్చిన గడువులోగానే పూర్తి చెయ్యాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సి.ఈ. ఓ నారాయణమూర్తి, డిప్యూటీ సి.ఈ. ఓ సందీప్, ఆర్.డి. ఓ దిలీప్ చక్రవర్తి, డి.ఈ. ఓ ప్రేమ్ కుమార్, పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లెక్సీలు కనిపిస్తే చర్యలు తప్పవు - అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు వద్దు: దేవరాపల్లి ఎంపీడీఓ కిరణ్ వరప్రసాద్ హెచ్చరిక



**దేవరాపల్లి , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో ఎక్కడా రాజకీయ ఫ్లెక్సీలు, బోర్డులు, పోస్టర్లు, కరపత్రాలు ఉంచరాదని ఎంపీడీఓ కిరణ్ వరప్రసాద్ స్పష్టం చేశారు .గతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను 24 గంటల్లోగా తొలగించాలి. లేకుంటే అధికార సిబ్బందే తొలగిస్తారని హెచ్చరించారు.ఎన్నికల నియమావళి ప్రకారం ఎటువంటి సమావేశాలు,ర్యాలీలు నిర్వహించాలన్నా ముందుగా ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్ లో అనుమతి తప్పనిసరి .మైక్ సెట్లు, సౌండ్ సిస్టమ్ వాడే వారు కూడా కచ్చితంగా అనుమతి పొందాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.అభ్యర్థులు, రాజకీయ నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాలను పాటించాలని మండల పరిషత్ అధికారులు కోరారు.

# విశాఖ కూటమి మేయర్ అభ్యర్థిగా ముక్కా శ్రావణి

ఒకటి తరువాయి

పనిచేసిన అనుభవం కలిగిన డాక్టర్ ముక్కా శ్రావణి పేరు చర్చకు రావడం ప్రాధాన్యం సంతరించుకుందని రాజకీయ వర్గాల్లో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మహిళా నాయకత్వానికి ప్రాధాన్యం కల్పించే దిశగా ఈ పరిణామాన్ని కాపు సేన అధ్యక్షుడు బందారు నారాయణమూర్తి లంకా భాస్కర్, దాసరి రాధాకృష్ణ, తుమరాడ చంద్రమౌళేశ్వరరావు స్వాగతించారు. మా కాపుల ఐక్యమత్యంతో అందరినీ కలుపుకుపోయి రేయింబవళ్లు కష్టపడి విశాఖ మేయర్ స్థానాన్నిగెలిపించి కూటమి నాయకులకు గిఫ్ట్ గా ఇస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2026

# ఎకో మరియు ఫైర్ టీవీ పరికరాలపై 45% వరకు తగ్గింపు పొందండి

**ఏదైనా ఎకో స్మార్ట్ స్పీకర్, స్మార్ట్ డిస్ప్లే లేదా ఫైర్ టీవీ స్టిక్‌ను కొనుగోలు చేయండి మరియు అలెక్సాంకి ఉచిత 'ఎర్లీ యాక్సెస్' పొందండి**




**విశాఖపట్నం , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2026 ఇప్పుడు ప్రారంభమైంది. ఇది ఎకో స్మార్ట్ స్పీకర్లు ౚ స్మార్ట్ డిస్ప్లేలు, ఫైర్ టీవీ స్ట్రీమింగ్ స్టిక్‌లు, ఫైర్ టీవీ బిల్ట్-ఇన్ స్మార్ట్ టీవీలపై అద్భుతమైన ఆఫర్లను అందిస్తోంది. వాయిస్ కంట్రోల్‌తో రోజువారీ పనులను సులభతరం చేసుకోవాలన్నా, టీవీ స్ట్రీమింగ్ అనుభవాన్ని మెరుగుపరచుకోవాలన్నా లేదా మీ స్మార్ట్ హోమ్‌ను సమర్థవంతంగా నిర్వహించుకోవాలన్నా- ఇందులో అందరికీ సరిపోయే ఎంపికలు ఉన్నాయి. ఈ పండగ సీజన్‌లో, ఏదైనా ఎకో స్మార్ట్ స్పీకర్, స్మార్ట్ డిస్ప్లే లేదా ఫైర్ టీవీ స్టిక్‌ను కొనుగోలు చేసి, సరికొత్త అలెక్సాంకి ఉచిత ఎర్లీ యాక్సెస్‌ను పొందండి. అలెక్సాం అనేది అమెజాన్ జనరేటి y• AI ఆధారిత పర్సనల్ అసిస్టెంట్. ఇది సహజంగా సంభాషించగలదు. మరింత తెలివైనది, వ్యక్తిగతీకరించి, పూర్తిగా భారతీయ శైలిని కలిగి, వాస్తవ ప్రపంచంలో పనులను నిర్వహిస్తుంది.

**తప్పక చూడాల్సిన కొన్ని ముఖ్యమైన ఆఫర్లు ఇక్కడ ఉన్నాయి:**

స్మార్ట్ హోమ్ జీవనశైలి అనుభవాన్ని పూర్తిగా ఆస్వాదించండి. అలెక్సా మరియు అలెక్సాం ఆధారిత ఎకో స్మార్ట్ స్పీకర్లు, స్మార్ట్ డిస్ప్లేలతో, కేవలం మీ వాయిస్ ద్వారా పనులను మరింత తెలివిగా, సౌకర్యవంతంగా పూర్తి చేయవచ్చు. పండగ పనుల జాబితాలను నిర్వహించడం, మీకు ఇష్టమైన భక్తి సంగీతాన్ని ప్లే చేయడం లేదా పండగ వాతావరణానికి తగినట్లుగా స్మార్ట్ లైట్లను నియంత్రించడం వంటివి చేయవచ్చు. సరదాగా సాగిన ఇంటి పార్టీ తర్వాత, అలెక్సాంకి ఇలా చెప్పండి: "అలెక్సా, హెల్ప్ మీ క్లీన్ అప్" – అప్పుడు అది మీ స్మార్ట్ రోబోట్ వాక్యూమ్ను యాక్టివేట్ చేస్తుంది.

**అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సమయంలో పొందగలిగే ఆఫర్లు:**

ఎకో డాట్ (5వ తరం) పై నేరుగా ?1,000 తగ్గింపు. దీన్ని 4,499కి పొందండి. ఎకో స్పాట్పై నేరుగా 22% తగ్గింపు. దీన్ని 6,999కి పొందండి. ఎకో షో 8పై నేరుగా ?6,000 తగ్గింపు. దీన్ని 18,999కి పొందండి. అత్యంత కొత్త ఎకో డాట్ మాక్స్ పై నేరుగా 30% తగ్గింపు. దీన్ని 8,999కి పొందండి. మీ ఫైర్ టీవీకు సంబంధించి హెచ్‌డి మరియు 4ఖ స్ట్రీమింగ్ స్టిక్‌లతో స్ట్రీమింగ్‌ను వేగవంతంగా, సులభంగా చేసుకోండి. పండగ సీజన్ బ్లాక్‌బస్టర్ సినిమాలను చూడాలన్నా లేదా కుటుంబంతో కలిసి మీకు ఇష్టమైన షోలను మళ్లీ చూడాలన్నా, ఫైర్ టీవీ స్టిక్ మీకు వీలు కల్పిస్తుంది. దీని ద్వారా ప్రైమ్ వీడియో, నెట్‌ఫ్లిక్స్, జియోహాట్‌స్టార్, యూట్యూబ్, జీ5 వంటి ప్రముఖ ప్లాట్‌ఫారమ్‌ల నుండి లక్షలాది సినిమాలు, టీవీ షోలను స్ట్రీమ్ చేయవచ్చు (సబ్‌స్క్రిప్షన్ రుసుములు వర్తించవచ్చు). అలాగే, ప్రత్యేక కన్సోల్ అవసరం లేకుండానే నేరుగా ఫైర్ టీవీ ద్వారా ఎక్స్‌బాక్స్ క్లౌడ్ గేమింగ్‌ను ఆస్వాదించవచ్చు (దీనికి ఎక్స్‌బాక్స్ గేమ్ పాస్ సబ్‌స్క్రిప్షన్ అవసరం). అలెక్సా వాయిస్ రిమోట్తో, అలెక్సా లేదా అలెక్సాంని అడగడం ద్వారా మీరు సులభంగా కంటెంట్‌ను కనుగొని ప్లే చేయవచ్చు. ఉదాహరణకు, అలెక్సాంని ఇలా అడగండి: "వోహ్ కౌన్ సి ఫిల్మ్ థీ జిస్మే అలియా భట్ నే బెంగాలీ




జర్నలిస్ట్ కా రోల్ కియా థా?"– అప్పుడు అది ఆ సినిమాను మీ కోసం వెతికి పెడుతుంది. అమెజాన్.ఇన్లో ఈ ఆఫర్లన్నింటినీ, ఇతర వివరాలను చూడండి. అలాగే ఎకో మరియు ఫైర్ టీవీతో మీ పండగ సీజన్‌ను ఆనందమయం చేసుకోండి. అమెజాన్. ఇన్లో వినియోగదారులు బ్యాంక్ ఆఫర్ల ద్వారా అదనపు డిస్కౌంట్లను పొందవచ్చు. వీటిలో ౹ాదీ× క్రెడిట్, డెబిట్ కార్డులు మరియు క్రెడిట్ కార్డ్ ఈఎంఐపై 10% తక్షణ డిస్కౌంట్, ప్రైమ్ సభ్యుల కోసం అమెజాన్ పే ఐసిఐసిఐ బ్యాంక్ క్రెడిట్ కార్డ్‌తో అపరిమిత 5% క్యాష్‌బ్యాక్ ఉన్నాయి. వినియోగదారులు నో-కాస్ట్ ఈఎంఐ, అమెజాన్ పే Later, ఎక్స్ఛేంజ్ ఆఫర్ల వంటి సౌకర్యవంతమైన చెల్లింపు పద్ధతులు, ఆఫర్లను కూడా ఆస్వాదించవచ్చు. ప్రైమ్ సభ్యులు Amazon.inలో మునుపెన్నడూ లేని అతిపెద్ద కలెక్షన్‌పై అదనంగా 5% తగ్గింపుతో సహా అదనపు పొదుపు పొందుతారు. ప్రత్యామ్నాయంగా, ప్రైమ్ సభ్యులు 2,500 విలువైన ఉత్పత్తులతో తమ షాపింగ్ కార్ట్‌లను నింపుకొని ?250 తిరిగి పొందవచ్చు.




## ఎన్నికల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం : ఎంపీడీవో ఇమ్మానియేల్

**వి.ఆర్.పురం , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** పోలవరం జిల్లా వి.ఆర్.పురం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చిన సందర్భంగా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఇమ్మానియేల్ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వై. సరస్వతి, ఎస్‌హెచ్ఓ సాదిక్ పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న రాజకీయ ఫ్లెక్సీలు, బ్యానర్లు, గోడ రాతలను వెంటనే తొలగించాలని, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో కీలకమైన జోనల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, ఎంసీసీ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్‌టీ), స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ (ఎస్ఎస్‌టీ) అధికారులకు వారి విధులు, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని, నగదు, మద్యం, బహుమతుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జోనల్, రూట్ ఆఫీసర్లు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి కనీస వసతులను పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా, శాంతియుతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎంపీడీవో అన్నారు . ఈ సమావేశంలో మండల ఎన్నికల అధికారులు, వివిధ శాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది పాల్గొన్నారు.

# మేయర్ ఎన్నికల నామినేషన్ రూమ్స్ ను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్

**నామినేషన్ల దాఖలుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించండి : జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్**




**విశాఖపట్నం , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ రెండవ సాధారణ ఎన్నికలు--2026కు సంబంధించి, జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సిటీ ఆపరేషన్స్ సెంటర్ సమీపంలో ఏర్పాటు చేసిన మేయర్ అభ్యర్థి పోటీకి నామినేషన్లు స్వీకరించే రిటర్నింగ్ అధికారి రూమ్ ను జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్ శుక్రవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణకు ఏర్పాటు చేసిన రూమ్, రిటర్నింగ్ అధికారి విధులు నిర్వహించే ప్రదేశంతో పాటు అభ్యర్థులకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై మేయర్ అభ్యర్థి రిటర్నింగ్ అధికారికి పలు సూచనలు చేశారు. మేయర్ పదవికి పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు నామినేషన్ల దాఖలుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని వారికి స్పష్టంగా అందించాలని కమిషనర్ సూచించారు. హెల్ప్‌డెస్క్ వద్ద అవసరమైన సమాచారం, సహాయ సహకారాలు అందుబాటులో ఉంచాలని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



# కవిటి మండలంలో ఎంపీటీసీ రిజర్వేషన్లు ఖరారు

**22 స్థానాలకు అధికారిక ప్రకటన..**
**మహిళలకు 11 స్థానాలు కేటాయింపు**



**కవిటి , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** కవిటి మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ) రిజర్వేషన్లు అధికారికంగా ఖరారయ్యాయి. జిల్లా గెజిట్ నోటిఫికేషన్ నంబర్ 575 ప్రకారం పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి, ఉప జిల్లా ఎన్నికల అధికారి రిజర్వేషన్లకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని మొత్తం 22 ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ప్రకటించడంతో స్థానికంగా ఎన్నికలపై ఆసక్తి నెలకొంది.

**మహిళలకు పది స్థానాలు**

మొత్తం 22 స్థానాల్లో ఎస్టీ మహిళకు ఒకటి, ఎస్టీ జనరల్‌కు ఒకటి, బీసీ మహిళలకు నాలుగు, బీసీ జనరల్‌కు ఐదు, జనరల్ మహిళలకు ఆరు, అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీకి ఐదు స్థానాలు కేటాయించారు.

**రిజర్వేషన్ల వివరాలు ఇలా..**

ఎస్టీ మహిళకు వరక, ఎస్టీ జనరల్‌కు బొరివంక-1 స్థానాలు కేటాయించారు. బీసీ మహిళలకు బల్లిపుట్టుగ, ఖోజ్జిరియా, బొరివంక -2, రాజపురం-1 స్థానాలు రిజర్వ్ అయ్యాయి. బీసీ జనరల్ కేటగిరీలో రాజపురం-2, కుసుంపురం, సహలా లపుట్టుగ, గొర్లెపాడు, కర పాడు స్థానాలు ఉన్నాయి.జనరల్ మహిళలకు కవిటి-3, జగతి, డి.జి.పుట్టుగ, బెజ్జిపుట్టుగ, కవిటి-1, నెలవంక స్థానాలు కేటాయించారు. అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో కపాసుకుద్ది, మాణిక్యపురం, కవిటి-2, లండారిపుట్టుగ, బెలగాం స్థానాలు ఉన్నాయి.

**ఆశావహుల్లో ఆసక్తి**

రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఎంపీటీసీ స్థానాల నుంచి పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు తమకు అనుకూలమైన స్థానాల పై దృష్టి సారిస్తున్నారు. మహిళా రిజర్వేషన్లు అమలులోకి రావడంతో ఆయా స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఆసక్తి నెలకొంది. రాబోయే ఎన్నికల్లో తమ రాజకీ య అవకాశాలను పరిశీలించుకునే పనిలో స్థానిక నాయకులు నిమగ్నమవు తున్నారు. అధికారిక రిజర్వేషన్ల ప్రకటనతో మండలం లో స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ మొదలైంది.

# జీవీఎంసీ వార్డు సభ్యుల పోటీకి 66 నామినేషన్లు దాఖలు

**మేయర్ స్థానానికి తొలి రోజు దాఖలు కాని నామినేషన్లు**

**విశాఖపట్నం , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ రెండో సాధారణ ఎన్నికలు--2026కు సంబంధించి మేయర్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి తొలి రోజు అయిన 2026 అక్టోబర్ 16న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరిగిందని, శుక్రవారం మేయర్ స్థానానికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని మేయర్ రిటర్నింగ్ అధికారి, వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం 66 నామినేషన్లు దాఖలయ్యాయని సంబంధిత జోనల్ రిటర్నింగ్ అధికారులు తెలిపారు.

**జోన్ల వారీగా దాఖలైన వార్డు అభ్యర్థుల నామినేషన్ల వివరాలు:**

తొలి రోజు ఈస్ట్ జోనులో మొత్తం 4 నామినేషన్లు, సౌత్ జోనులో మొత్తం 11 నామినేషన్లు, నార్త్ జోనులో మొత్తం 7 నామినేషన్లు, వెస్ట్ జోనులో మొత్తం 3 నామినేషన్లు, గాజువాక జోనులో మొత్తం 26 నామినేషన్లు, అగనంపూడి జోన్లో మొత్తం 9 నామినేషన్లు, పెందుర్తి జోన్లో మొత్తం 6 నామినేషన్లు. భీమిలి, మధురవాడ, అనకాపల్లి జోన్లలో వార్డు సభ్యుల స్థానాలకు తొలి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని సంబంధిత రిటర్నింగ్ అధికారులు తెలిపారు.

# బైపల్లి గాంధీకి 'తీరప్రాంత వాడబలిజ సంక్షేమ సంఘం' అభినందనలు




**గాజువాక , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ ) 91వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా రెండోసారి అవకాశం దక్కించుకోవాలని వాడబలిజ మత్స్యకార నాయకుడు బైపల్లి గాంధీ కి తీరప్రాంత వాడబలిజ సంక్షేమ సంఘం శుక్రవారం అభినందనలు తెలియజేశారు. గాంధీ నాయకత్వంపై నమ్మకంతో ఆయనకు పోటీ చేసే అవకాశం కల్పించాలని తెలుగుదేశం పార్టీ అధిష్ఠానానికి, అలాగే టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకి సంఘం తరపున కోరుతున్నామన్నారు . ప్రముఖ వాడబలిజ సంఘ సెక్రటరీ కారి గోవిందరాజు, సంఘం అధ్యక్షులు డాక్టర్ అర్జాల వి . రమణ మాట్లాడుతూ.. 91వ వార్డులో 14వేల మంది ఓటర్లు ఉంటే అందులో 8వేల మంది వాడబలిజలు ఉన్నారని ఎన్నికల్లో అవకాశం ఇస్తే బైపల్లి గాంధీ ఘనవిజయం సాధించడానికి కృషి చేస్తామన్నారు . ఈ విజయానికి తీరప్రాంత వాడబలిజ మత్స్యకార సోదరులందరూ ఏకతాటిపై నిలిచి, తమ వంతు పూర్తి సహకారాన్ని అందించి ఆయనను భారీ మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు.

# కూటమి ఐక్యత కోసం త్యాగాలకు సిద్ధపడాలి

- క్రమశిక్షణే టీడీపీ బలం..
అధిష్టాన నిర్ణయమే శిరోధార్యం
- వ్యక్తిగత ఆశలకంటే రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలి
- మున్సిపాలిటీల సర్దుబాటుపై మూడు పార్టీల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి
- స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన గొడ్డలి పార్టీ
- బీసీలు, బలహీన వర్గాలకు రాజకీయంగా న్యాయం చేయడమే కూటమి సంకల్పం
- సాలూరులో నాయకులు, కార్యకర్తలకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిశానిర్దేశం




**సాలూరు, పార్వతీపురం , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ):** రాష్ట్ర ప్రయోజనాలు, కూటమి ఐక్యత కోసం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అవసరమైన త్యాగాలకు సిద్ధపడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. మన్యం జిల్లా సాలూరులో మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కలిసి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొని ప్రసంగించారు.రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ఆ లక్ష్యసాధనకు నాయకులంతా పెద్దమనసుతో ఆలోచించాలని కోరారు. సాలూరులో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత ఆశలు, పదవుల ఆకాంక్షలకంటే రాష్ట్ర భవిష్యత్తు, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీకి క్రమశిక్షణే ప్రధాన బలమని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ స్థాపించిన ఈ పార్టీకి నాలుగు దశాబ్దాలకు పైగా ఘన చరిత్ర ఉందన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పార్టీ క్రమశిక్షణను పాటించాల్సిందేనని తేల్చిచెప్పారు. ఎవరికైనా అభిప్రాయ భేదాలు, అసంతృప్తి ఉంటే పార్టీ దృష్టికి తీసుకురావాలని, బహిరంగ వేదికలపై వ్యతిరేకత ప్రదర్శించడం సరికాదని సూచించారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తీసుకునే నిర్ణయాలకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని అన్నారు. కూటమి కొనసాగాలని కోరుకునేటప్పుడు కొన్ని త్యాగాలకు కూడా సిద్ధంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రధాన పార్టీగా ఉన్న తెలుగుదేశం ఆ బాధ్యతను గుర్తించి ముందుండాలన్నారు. గత వైసీపీ పాలనలో ఎదురైన పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా కూటమిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని మూడు పార్టీల నాయకులు పరస్పర గౌరవం, సమన్వయంతో పనిచేయాలని కోరారు. మనస్పర్థలు, విభేదాలతో సమష్టి లక్ష్యానికి విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మున్సిపాలిటీలకు సంబంధించి కూటమి పార్టీల మధ్య సర్దుబాటుపై చర్చలు కొనసాగుతున్నాయని, ఏ మున్సిపాలిటీ ఏ పార్టీకి కేటాయించాలనే అంశంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని అచ్చెన్నాయుడు తెలిపారు. తెలుగుదేశం పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు, స్థానిక పరిస్థితులను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తున్నామని చెప్పారు. స్థానిక నాయకత్వంతో చర్చిస్తూ సమన్వయంతో ముందుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో కేసులు, ఇబ్బందులను ఎదుర్కొని, సొంత డబ్బు ఖర్చు చేసి పార్టీని నిలబెట్టిన కార్యకర్తల కృషిని గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు పోటీ చేయాలని, చైర్మన్ వంటి పదవులు చేపట్టాలని ఆశించడం సహజమేనని, వారి మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటూనే అధిష్టానం నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు స్థానిక సంస్థలు ప్రజలకు అత్యంత చేరువగా పనిచేసే మూడో స్థాయి ప్రభుత్వమని మంత్రి పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు స్థానిక సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు తమ బాధ్యతలు నిర్వర్తించేందుకు అవసరమైన నిధులు లేకుండా చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సంఘం నిధులను సైతం ఇతర అవసరాలకు మళ్లించి, కనీస మౌలిక వసతులు కల్పించలేని స్థితికి స్థానిక సంస్థలను దిగజార్చిందని ఆరోపించారు. గత స్థానిక సంస్థల ఎన్నికలను అప్రజాస్వామికంగా నిర్వహించారని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వారి విశ్వాసంతో విజయం సాధించాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కితే, వాటిని 34 శాతానికి పెంచిన ఘనత చంద్రబాబు నాయుడిదని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. బీసీలు, బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా న్యాయం చేయాలన్నది ఎన్డీయే కూటమి దృఢసంకల్పమని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలు, అధినాయకత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేసి ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.



# సీగ్రామ్స్ ఎక్స్‌క్లామేట్ ఆన్‌ను ప్రారంభించిన పెర్నోడ్ రికార్డ్ ఇండియా




**విశాఖపట్నం , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** పెర్నోడ్ రికార్డ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్‌లో సీగ్రామ్స్ ఎక్స్‌క్లామేట్ ఆన్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. గత 30 ఏళ్లలో కంపెనీ చేపట్టిన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆవిష్కరణ ఇది. సీగ్రామ్స్ ఎక్స్‌క్లామేట్ ఆన్ భారతదేశానికి ఒక ప్రత్యేకమైన బ్రాండ్ పోర్ట్‌ఫోలియో ఇది విస్కీ, వోడ్కా, జిన్, రమ్ మరియు బ్రాందీ అనే ఐదు విభిన్న స్పిరిట్ కేటగిరీలను కలిగి ఉంది. ఇవన్నీ ఒకే ప్రీమియం బ్లెండెడ్ శ్రేణిలో ఒకే ధరకే అందించబడతాయి. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న యువ వినియోగదారుల అవసరాలను తీర్చడానికి ఈ బ్రాండ్ ఎంట్రీ స్థాయి ప్రీమియం ధరల శ్రేణిలో వ్యూహాత్మకంగా గణనీయమైన స్థానంలో ఉంచబడింది. ఇందు కోసం లక్ష్యంగా 26 నుంచి 30 సంవత్సరాల వినియోగదారులు ఎంచుకోబడ్డారు. ఈ వినియోగదారులు సులభంగా అభిప్రాయాలు వ్యక్తం చేస్తారు మరియు విలక్షణమైన ఉత్పత్తి వైపు ఆకర్షితులవుతారు. వీరు శక్తివంతమైన సామాజిక సమూహాలుగా కలుస్తారు మరియు మహిళలు, మగవారు కలిసి సమావేశమైనప్పుడు ప్రతి ఒక్కరికి పానీయాల విషయంలో భిన్నాభిప్రాయాలు ఉంటాయి. అది జిన్, వోడ్కా, రమ్ మరియు బ్రాండీ వంటి విస్కీని మించిన శ్రేణుల్లో అభివృద్ధిని వివరిస్తుంది. ప్రతి ఏడాది చట్టబద్ధంగా మద్యం సేవించే వయస్సులోకి 20 మిలియన్స్ కి పైగా వినియోగదారులు ప్రవేశిస్తుండటంతో, అందుబాటులో ఉండే ప్రీమియం ధరలకి నాణ్యతతో కూడిన ఆల్కహాల్ కోసం డిమాండ్ ఉన్న మార్కెట్ ఆవశ్యకతను ఎక్స్‌క్లామేట్ ఆన్ పరిష్కరించింది. బ్రాండ్ యొక్క “ఇది ఎక్స్‌క్లామేట్ ఆన్ సమయం” ప్రతిపాదన, భారతదేశంలోని ఆధునిక తరం వినియోగదారుల కోసం సాధారణ క్షణాలను అసాధారణ అనుభవాలుగా మార్చే ఒక ఉత్ప్రేరకంగా దీనిని నిలబెడుతుందని పెర్నాడ్ రికార్డ్ ఇండియా అధికారి జీన్ టోబౌల్ తెలిపారు.

## దసరా ఎఫెక్ట్ - తిమిరాం వారపు సంతకు పోటెత్తిన జనం, నాటుకోడికి రూ.5 వేలు, పొట్టేలుకు రూ.28 వేలు



**దేవరాపల్లి , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** మండలంలోని తిమిరాం వారపు సంత శుక్రవారం దసరా పండగ సందడితో కళకళలాడింది. పండగకు మరో నాలుగు రోజులే ఉండటంతో మాంసం ప్రియులు సంతకు పోటెత్తారు. పండగ పూజల కోసం నాటుకోళ్లకు విపరీతమైన గిరాకీ నెలకొంది. సైజు, రంగును బట్టి ఒక్కో నాటుకోడి రూ. 1,000 నుండి రూ. 5,000 వరకు అమ్ముడైంది.

బలికి, విందులకు గొర్రె పొట్టేళ్లను ఎగబడి కొన్నారు. బరువును బట్టి ఒక్కో పొట్టేలు రూ. 10,000 నుండి రూ. 28,000 వరకు పలికింది. మేకలు కూడా రూ. 8 వేల నుండి రూ. 15 వేల వరకు అమ్ముడయ్యాయి. అనకాపల్లి, విశాఖ, విజయనగరం, అల్లూరి జిల్లాల నుండే కాకుండా చుట్టుపక్కల మండలాల నుండి వందలాది మంది కొనుగోలుదారులు, విక్రేతలు తరలివచ్చారు. ఉదయం 4 గంటల నుండే సంతలో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం వరకు సంత జనంతో కిక్కిరిసిపోయింది. పండగ సీజన్ కావడంతో రైతులు, పెంపకందారులు తాము పెంచిన కోళ్ళు, గొర్రెలకు మంచి ధర రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొనేవారు, అమ్మేవారి మధ్య బేరసారాలతో సంత అంతా సందడిగా మారింది.

# సమతుల్య ఎరువుల వినియోగంపై అవగాహన



**కవిటి , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, పర్లాకిమిడికి చెందిన బి.ఎస్‌సి. అగ్రికల్చర్ విద్యార్థిని మార్పు మనోజ్ఞ వరఖ గ్రామంలో రూరల్ అగ్రికల్చర్ వర్క్ ఎక్స్పీరియన్స్ కార్యక్రమంలో భాగంగా ఎరువుల వినియోగంపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఎరువులు, వాటి ఉపయోగాలు, పంటలకు అవసరమైన పోషకాల గురించి వివరించారు. నేల పరీక్ష ఆధారంగా, వ్యవసాయ నిపుణుల సిఫార్సుల మేరకు ఎరువులను సరైన మోతాదులో వినియోగించాలని సూచించారు. సమతుల్య ఎరువుల వినియోగం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు పంటల ఎదుగుదల, దిగుబడి మెరుగుపడే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక రైతులను, వ్యవసాయ సిబ్బంది పాల్గొని విద్యార్థినీ ప్రదర్శనను అభినందించారు. రైతులు శాస్త్రీయ ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించాలని అవగాహన కల్పించాలి అని అన్నారు.

## సింహాచల క్షేత్రంలో అమ్మవారి సన్నిధిలో శాస్త్రోక్తంగా ఆయుధ పూజ

**సింహాచలం , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, నేడు శ్రీ సింహవల్లి తాయారు సన్నిధిలో అమ్మవారికి మరియు ఆయుధాలకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆలయ స్థానాచార్యులు డాక్టర్ టి.పి. రాజగోపాల్ గారి ఆధ్వర్యంలో, ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి పిల్లా శ్రీనివాసరావు, పర్యవేక్షణ అధికారి కరోతి సూర్యనారాయణ పర్యవేక్షణలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ముందుగా ఆలయ అర్చక స్వాములు చక్రవర్తి, లక్ష్మీకుమార్ తదితరులు శ్రీ విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం ఆయుధాలను ఆవాహనం, తరువాత అమ్మవారికి విశేష అలంకరణ గావించి ఆయుధ పూజా క్రతువును శాస్త్రోక్తంగా పరిపూర్ణం చేశారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, అర్చక స్వాములు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఎన్నికల్లో గెలవాలి

**కార్యకర్తలకు రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పిలుపు**




**వి.ఆర్.పురం , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం పార్టీని గెలిపించే దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని, పార్టీ విజయానికి సమష్టిగా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. వి.ఆర్.పురం మండలంలోని బొప్పెన భీమయ్య కార్యాలయం వద్ద నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజల తరఫున నిరంతరం పోరాడాలని, ఎన్నికల్లో ప్రజా సమస్యలను ప్రధానంగా ప్రస్తావించాలని సూచించారు. పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు లోకనాథ్ పోలవరం జిల్లా కార్యదర్శి బొప్పెన్ కిరణ్ జిల్లా కార్యవర్గ సభ్యులు జిల్లా నాయకులు మండల నాయకులు మండల నాయకులు పాల్గొని ఎన్నికల కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు ఎస్ రాజులు, లోతా.రామారావు, పల్లపు. వెంకట్, ఎం.వాణిశ్రీ, ఐ.వి.మేకల. నాగేశ్వరావు, పులి.సంతోష్ కుమార్, బాబు. బొర్రయ్య, సీసం .సురేష్, సత్యనారాయణ, సీతారామయ్య, ఎస్. చినబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం : జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి

- ఎన్నికల మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి
- నామినేషన్ల నుంచి కౌంటింగ్ అనంతరం వరకు పటిష్ట బందోబస్తు
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా - ట్రబుల్ మ్యాంగర్స్‌పై బైండోవర్ చర్యలు
- పల్లె నిద్ర, గ్రామసభల ద్వారా ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించాలి
- ప్రతిరోజూ కార్డాన్ సెర్చ్‌లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు ముమ్మరం చేయాలి
- చెక్‌పోస్టుల వద్ద 24/7 అప్రమత్తత తప్పనిసరి
- ఎన్నికల సన్నద్ధతపై జిల్లా ఎస్పీ సమీక్ష సమావేశం



**శ్రీకాకుళం , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యంగా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎన్నికల సన్నద్ధతపై పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించి, ఎన్నికల భద్రత, బందోబస్తు ఏర్పాట్లు, సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా, ముందస్తు నివారణ చర్యలు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ల నుంచి కౌంటింగ్ అనంతరం వరకు పటిష్ట బందోబస్తు.ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నుంచి పోలింగ్, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, కౌంటింగ్ అనంతరం వరకు ప్రతి దశకు ముందస్తు ప్రణాళికతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఎన్నికల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన బలగాలను కేటాయించాలని, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా.గతంలో ఎన్నికల సమయంలో ఘర్షణలు జరిగిన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాల వద్ద స్థానిక పరిస్థితులకు అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టాలని, ఎన్నికలకు విఘాతం కలిగించే వ్యక్తులుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ కార్డాన్ సెర్చ్‌లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు ముమ్మరం చేయాలి.జిల్లావ్యాప్తంగా ప్రతిరోజూ కార్డాన్ సెర్చ్‌లు నిర్వహిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలపై నిఘా పెంచాలని సూచించారు. అక్రమ



మద్యం, నగదు, ఓటర్లను ప్రభావితం చేసే ప్రలోభాల నియంత్రణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను ముమ్మరం చేసి, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద 24/7 అప్రమత్తత తప్పనిసరి.జిల్లా సరిహద్దులు, ప్రధాన రహదారులపై ఏర్పాటు చేసిన 11 చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది 24/7 అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. వాహన తనిఖీలు నిరంతరం చేపడుతూ అక్రమ నగదు, మద్యం, ఇతర నిషేధిత వస్తువుల రవాణాను అరికట్టాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై తక్షణమే స్పందించాలని తెలిపారు. పల్లె నిద్ర, గ్రామసభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి.పల్లె నిద్ర కార్యక్రమాలు, గ్రామసభల ద్వారా ప్రజలకు ఎన్నికల మార్గదర్శకాలు, ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రలోభాలకు లోనుకాకుండా, బెదిరింపులకు భయపడకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించాలని తెలిపారు.

## ట్రబుల్ మ్యాంగర్స్‌పై బైండోవర్ చర్యలు

ఎన్నికల సమయంలో ఘర్షణలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి, చట్టపరమైన నిబంధనల ప్రకారం బైండోవర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వారి కదలికలపై నిఘా ఉంచుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అప్రమత్తంగా ఉండాలన్నారు.ఎన్నికల ప్రతి దశలో పటిష్ట భద్రత కల్పించి, ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ పి. శ్రీనివాసరావు, డీఎస్పీలు ధనుంజయ నాయుడు, లక్ష్మణరావు, వెంకట రమణ, భాస్కర్ రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఇమ్మాన్యుయేల్ రాజుతో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# టెక్కలి క్రీడాకారుల పతకాల పంట..జాతీయ స్థాయి పోటీలకు ముగ్గురు అర్హత!

**టైక్వాండో విజేతలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అభినందనలు..కోచ్ శేఖర్‌కు ప్రశంసలు**




**కోటబొమ్మాళి , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టైక్వాండో పోటీల్లో పతకాలు సాధించి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన టెక్కలి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం క్రీడాకారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందించారు. నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో క్రీడాకారులను అభినందించిన మంత్రి, జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటి ఆంధ్రప్రదేశ్‌కు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో మెండ తపస్వి స్వర్ణ పతకం సాధించి, వచ్చే జనవరిలో హిమాచల్ ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. అండర్-17 బాలికల విభాగంలో జానపాన వాగ్దేవి అక్షయ స్వర్ణ పతకం సాధించి, ఈ నెల 22 నుంచి 26 వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందింది. అండర్-14 బాలుర విభాగంలో గిన్ని దీపక్ రెడ్డి స్వర్ణ పతకం సాధించి, డిసెంబర్‌లో నాగాలాండ్‌లో జరగనున్న జాతీయ స్థాయి టైక్వాండో పోటీలకు అర్హత సాధించాడు. మరో క్రీడాకారుడు గిన్ని దిలీప్ రెడ్డి రజత పతకం సాధించి ప్రతిభ కనబరిచాడు. టెక్కలి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం పట్ల మంత్రి అచ్చెన్నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి, వారిని పోటీలకు తీర్చిదిద్దుతున్న కోచ్ నర్సిపురం శేఖర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో కృషి కొనసాగించి జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

# 70 లక్షల విలువగల 140 కేజీల గంజాయి పట్టివేత




**అనకాపల్లి , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** జిల్లాలో మాదకద్రవ్యాల నిరోధానికి చేపట్టిన ప్రత్యేక నిఘా చర్యల్లో భాగంగా కశింకోట పోలీసులు, ఈగల్ టీమ్ సంయుక్తంగా భారీ గంజాయి అక్రమ రవాణాను చాకచక్యంగా భగ్నం చేశారు. ఎన్‌హెచ్-16 జాతీయ రహదారిపై నిర్వహించిన తనిఖీల్లో దాదాపు 140 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ? కశింకోట పోలీస్ స్టేషన్ సి.ఐ (జ×) ఎ.స్వామి నాయుడు కి అందిన ముందస్తు, విశ్వసనీయ సమాచారం మేరకు ఈగల్ టీమ్ మరియు కశింకోట పోలీస్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఎన్‌హెచ్-16 (చీ౧-16) జాతీయ రహదారిపై కశింకోట సమీపంలోని హెచ్ ఓ పి హోటల్ ఎదురుగా ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు.?ఈ క్రమంలో అటుగా వచ్చిన +జీ 01 ఞ 7861 నంబర్ గల కంటైనర్ లారీని ఆపగా, అందులోని ఇద్దరు వ్యక్తులు పోలీసులను గమనించి పారిపోయేందుకు యత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వారిలో లారీ డ్రైవర్ సద్దాం హుస్సేన్ కాగా, మరొకరు 17 ఏళ్ల మైనర్ బాలుడు.రహస్య క్యాబిన్‌లో భారీ నిల్వలు: కంటైనర్ లారీని నిశితంగా పరిశీలించిన పోలీసులకు విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. ఎవరికీ అనుమానం రాకుండా డ్రైవర్ సీటు వెనుక భాగంలో ప్రత్యేకంగా ఒక రహస్య క్యాబిన్‌ను నిర్మించారు. అందులో దాచిన 28 ప్యాకెట్ల (మొత్తం 140 కేజీలు) గంజాయిని, రవాణాకు ఉపయోగించిన కంటైనర్ లారీని, ఒక ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ మరియు ఒక కీప్యాడ్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.లి ?ప్రాథమిక విచారణలో రాజస్థాన్‌కు చెందిన కిసాన్ ఏ కిషన్ జీ ఏ కిషన్ జాట్ అనే ప్రధాన సూత్రధారి ఆదేశాల మేరకు వీరు ఒడిశా రాష్ట్రం నుంచి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయిని స్వీకరించినట్లు తేలింది. అనంతరం మర్రిపాలెం టోల్ ప్లాజా సమీపంలోని లే-బై రోడ్డులో లారీ క్యాబిన్‌లో రాజస్థాన్‌కు తరలించేందుకు పక్కా ప్రణాళిక వేసినట్లు వెల్లడైంది. ఈ అంతర్రాష్ట్ర గంజాయి నెట్‌వర్క్‌లో ఉన్న ఇతర నిందితులు, సరఫరాదారుల వివరాలను వెలికితీసేందుకు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు వేగవంతం చేశారు.న్యాయపరమైన చర్యలు:లి ?పట్టుబడిన ప్రధాన నిందితుడు సద్దాం హుస్సేన్‌ను అరెస్ట్ చేసి విశాఖపట్నం సెంట్రల్ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించారు. చట్టంతో సంఘర్షణలో ఉన్న బాలుడిని (జ×జూ) విశాఖపట్నంలోని జువెనైల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచారు ?ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, మాట్లాడుతూ: “అనకాపల్లి జిల్లాను గంజాయి, మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోంది. జిల్లా మీదుగా అక్రమ రవాణా చేసేందుకు ఎంతటి అధునాతన మార్గాలు ఎంచుకున్నా పోలీసుల డేగ కన్ను నుంచి తప్పించుకోలేరు. గంజాయి సాగు, నిల్వ, రవాణా, కొనుగోలు లేదా విక్రయాలలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ భాగస్వాములయ్యే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. అలవాటుపడిన నేరగాళ్లపై పీడీ యాక్ట్ (ౡణ–ూఙ్) నమోదు చేయడంతో పాటు వారి అక్రమ ఆస్తులను జప్తు చేసే ప్రక్రియను కూడా వేగవంతం చేస్తాం. యువత భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాలపై సమాజం కూడా పోరాడాలి. ప్రజలు లేదా వాహనదారులు తమ పరిసరాల్లో గంజాయి రవాణాపై ఏ సమాచారం ఉన్నా నిర్భయంగా పోలీసులకు తెలపవచ్చు; సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.”సకాలంలో స్పందించి చాకచక్యంగా గంజాయి రవాణాను అడ్డుకున్న కశింకోట సిఐ ఎ.స్వామి నాయుడు గారిని, ఈగల్ టీమ్ సభ్యులను, కశింకోట పోలీస్ సిబ్బందిని ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు నగదు రివార్డులను అందజేశారు.

# నాడు కార్యకర్తకు భరోసా..నేడు రూ.1.11 లక్షల చెక్కు పంపిణీ

**ఎమ్మెల్యే హామీ మేరకు బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్**



**వి. ఆర్.పురం , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) :** పోలవరం జిల్లా వర రామచంద్రపురం మండలం ములకలపల్లి పంచాయతీ పరిధిలోని జల్లివారిగూడెం గ్రామానికి చెందిన జల్లి రాజు ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈ చికిత్స కోసం సుమారు రూ.2 లక్షలకు పైగా ఖర్చు అయినట్లు తెలిసింది. మూడు నెలల క్రితం



ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, విజయ్ భాస్కర్ జల్లివారిగూడెం గ్రామంలో నిర్వహించిన డోర్ టు డోర్ కార్యక్రమంలో జల్లి రాజును పరామర్శించి, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శుక్రవారం మండల టీడీపీ అధ్యక్షుడు బొర్రా నరేష్, సొసైటీ చైర్మన్ గొంది చంద్రయ్య, సీనియర్ నాయకులు రాజేంద్రప్రసాద్, పాయం రామారావు తదితరులు బాధితుడికి రూ.1.11 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి పంచాయతీ నాయకులు జల్లి నవేష్, పూనెం శ్రీను, జల్లి బాబురావు, జల్లి లక్ష్మణ్, కిరణ్‌తో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం

## ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ నిశాంతి.టి

**పాడేరు , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ):** అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ నిశాంతి.టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పాడేరు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ వాసుదేవరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, డీఎల్‌పీఓ పి.ఎస్. కుమార్‌లతో కలిసి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు.

**సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు, జారీ చేసిన ఆదేశాలు:**

ఎన్నికల సన్నద్ధత: జిల్లాలో మొత్తం 229 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్న నేపథ్యంలో, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సమయం నుంచి లభించే సుమారు 26 రోజుల వ్యవధిని ముందస్తు ఏర్పాట్లకు సమర్థవంతంగా వినియోగించుకోవాలి. శిక్షణ కార్యక్రమాలు: రిటర్నింగ్ అధికారులు, మండల స్థాయి అధికారులు, ఎన్నికల సిబ్బందికి దశలవారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కల్పించాలి. రిటర్నింగ్ అధికారుల నియామకం: జిల్లాలోని 11 మండలాలకు నియమించిన జిల్లా స్థాయి రిటర్నింగ్ అధికారులకు రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ అందించాలి. వారి ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులకు కూడా శిక్షణ నిర్వహించాలి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పర్యవేక్షించేందుకు ప్రతి మండలంలో అవసరమైన చర్యలు తీసుకోవాలి. నిబంధనల ఉల్లంఘనలను అరికట్టేందుకు సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలి. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, తనిఖీ బృందాలు: ప్రతి మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు , స్టాటిస్టికల్ సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేసి, ఎన్నికల నిబంధనల అమలును నిరంతరం పర్యవేక్షించాలి. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు: ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, ర్యాంపులు, అనువైన భవనాలు తదితర కనీస హామీ సౌకర్యాలు కల్పించాలి. ముందస్తు తనిఖీలు నిర్వహించి, అవసరమైన సదుపాయాలను ఎన్నికలకు ముందుగానే పూర్తి చేయాలి. మారుమూల ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి: జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాలు, కొండ ప్రాంతాలు, కష్టతరమైన భౌగోళిక పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. రవాణా సదుపాయాలు: ఎన్నికల సిబ్బంది, ఎన్నికల సామగ్రి తరలింపునకు అవసరమైన ఆర్టీసీ బస్సులు, జీపులు, ప్రైవేట్ వాహనాలను ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉంచాలి. సిబ్బంది కేటాయింపు: ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని గుర్తించి, విధులు, బాధ్యతలను ముందుగానే కేటాయించాలి. శాఖల మధ్య సమన్వయం: ఎన్నికల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలి. తమకు కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలి. పారదర్శక ఎన్నికల నిర్వహణ: ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలి. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ, సబ్ కలెక్టర్ కె. సాహిత్, జెడ్పీ సీఈఓ వాసుదేవరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, డీఎల్‌పీఓ పి.ఎస్. కుమార్, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మండల తహశీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







# ఎన్నికల వేళ మద్యం అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా పెంచాలి : అభిషిక్త్ కిశోర్



**విశాఖపట్నం , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ):** జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలు-2026 నేపథ్యంలో మద్యం అక్రమ రవాణా, నిల్వలు, విక్రయాలు, పంపిణీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యాన్ని వినియోగించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని ఎక్సైజ్ శాఖ అధికారులు మద్యం నిల్వలు, విక్రయాలను గత ఏడాది ఇదే కాలంలో నమోదైన వివరాలతో పోల్చి పరిశీలించాలని సూచించారు. అక్రమ మద్యం తయారీ కేంద్రాలు, అక్రమ రవాణా, నిల్వలు, పంపిణీపై తనిఖీలు ముమ్మరం చేయాలని, అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దుల్లో నిఘా పెంచాలని ఆదేశించారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోలింగ్ ముగిసే సమయానికి ముందు 48 గంటల నిషేధిత కాలంలో, అలాగే ఓట్ల లెక్కింపు రోజున మద్యం విక్రయాలు, పంపిణీ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# విద్యా లక్ష్మీ అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు



**విశాఖపట్నం , అక్టోబర్ 16 ( మనం న్యూస్ ):** విశాఖ నగరంలోని బురుజుపేట లో వెలసియున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు శుక్రవారం విద్యాలక్ష్మీ (సరస్వతి ) అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, డాక్‌యార్డ్ కేటీబీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు అమ్మవారిని దర్శించుకుని నూతన వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సాయికృప ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారిని, సమీపంలోని సాయిబాబా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని దుర్గాదేవి ఆలయంలో కొలువున్న దుర్గాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల నిర్వాహకులు గంట్ల శ్రీనుబాబుకు ఆశీస్సులు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు.